క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డికి సన్మానం



గీసుకొండ : సీఎం రేవంత్‌రెడ్డిని ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ దుపాకి సంతోశ్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. సీఎం మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న క్రమంలో ఆయనకు హనుమకొండ జిల్లాలోని గూడెప్పాడ్ వద్ద సంతోశ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వల్లెం సుధాకర్, గాదె శ్రీకాంత్, పిట్టల అనిల్, గాదె క్రాంతి, వల్లెం సాయికుమార్, రాహుల్, దుపాకి భరద్వాజ్, పోలెబోయిన రాజు, ముజాహిద్, అజీం, నవాబ్ పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారికి..

పర్వతగిరి : మండలంలోని గోరుగుట్టతండా గ్రామ ప్రత్యేక అధికారిగా రాజేశ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ సర్పంచ్ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి దయాకర్, వార్డు సభ్యుడు నర్సింహులు శాలువాతో సన్మానించారు.

ఎస్సైకి బీఆర్ఎస్ నాయకుల..

రాయపర్తి : ఎస్సై వడ్డె సందీప్‌కుమార్‌ను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. తొలుత పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయక్, జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు నయీమ్, గారె నర్సయ్య, తాళ్లపెల్లి సంతోశ్‌గౌడ్, సజ్జన్, గూడెల్లి శ్రీను, సంకినేని ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

ఎస్సై వడ్డె సందీప్‌కుమార్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నంగునూరి అశోక్, ముద్రబోయిన వెంకన్న, కృష్ణమాచార్యులు, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, యాదగిరి, గబ్బెట బాబు, రంగారెడ్డి, రామశేఖర్, కుంట రమేష్, అఫ్రోజ్ ఖాన్, శ్రీను, రామా, కిషన్, యాకూబ్, గౌస్, గోపాల్, భిక్షం నాయక్, నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రైతుపై కొండచిలువ దాడి

చెన్నారావుపేట : రైతుపై కొండచిలువ దాడి చేసిన ఘటన మండలంలోని బోజేర్వు గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పరిధిలోని పానుగోడు గ్రామంలోని రాములు తండా శివారు పూల్‌సింగ్ తండాకు చెందిన బోడ ఈరు అనే రైతు బోజేర్వు గ్రామానికి చెందిన బండి గంగ రాములు వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం మొక్కజొన్నకు నీరు పెడుతుండగా కొండ చిలువ ప్రమాదవశాత్తు బోడ ఈరును కాటు వేసింది. దీంతో గమనించిన రైతు కొండ చిలువను హతమార్చాడు. అనంతరం స్థానికులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం ఆయనను గూడూరు ఆస్పత్రికి తరలించారు. ఈరు చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బుధరావుపేటలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మాధవ్‌గౌడ్ కథనం ప్రకారం... బుధరావుపేటకు చెందిన షేక్ సయ్యద్ (45) బ్యాండ్ వాయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సయ్యద్ రోడ్డు మీద నడుచుకుంటూ వస్తుండగా గూడూరు నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న ట్రాలీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన సయ్యద్‌ను స్థానికులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సయ్యద్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి కొడుకు యాకుబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్, లారీ ఢీ ఒకరికి తీవ్ర గాయాలు

రాయపర్తి : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రం శివారులోని మార్కెట్ యార్డ్ వద్ద వరంగల్–తొర్రూరు జాతీయ రహదారిపై పత్తి లోడుతో వరంగల్ నుంచి వస్తున్న లారీ తొర్రూరు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న తొర్రూరుకు చెందిన చింతల ప్రవీణ్ తీవ్ర గాయాల పాలవగా లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రవీణ్‌ను స్థానికులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఎస్సై వడ్డె సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాద తీరును పరిశీలించారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

సంగెం : సమాజంలోని ప్రతీఒక్కరు బ్యాంకుల్లో ఖాతాలు తీసుకుని సేవలు వినియోగించుకోవాలని గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ఎం.ప్రేమ్ కుమార్ కోరారు. మండలంలోని లోహిత గ్రామంలో ఆ బ్యాంకు గవిచర్ల శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. బ్యాంకు మిత్ర, వ్యవసాయ రుణాలు, డిపాజిట్లు, గోల్డ్‌లోన్, బీమా, సైబర్ మోసాలు, నగదు రహిత లావాదేవీలు, తదితర సేవలపై మ్యాజిక్ షో, జానపద గేయాలతో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడారు. వ్యవసాయ రుణాలు సకాలంలో తిరిగి చెల్లిస్తే వడ్డీ రాయితీ లభిస్తుందని చెప్పారు. డిపాజిట్లపై అధిక వడ్డీ, బంగారు ఆభరణాల తాకట్టుపై తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నామని తెలిపారు. ఖాతాదారులు ఏటీఎం, సీవీవీ, ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దని సూచించారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌లో ఏటా రూ.వెయ్యి చెల్లిస్తే రూ.20 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న జీవనజ్యోతి, సురక్ష, అటల్ పెన్షన్ యోజన, తదితర పథకాలను అర్హులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు మిత్ర శ్రీకాంత్, కళాజాత బృందం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్ కుమార్

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించండి



సమావేశంలో మాట్లాడుతున్న అబ్బాస్

నర్సంపేట : బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మహ్మద్ అబ్బాస్ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన స్టడీ సర్కిల్‌కు అబ్బాస్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాసమస్యలను విస్మరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, బ్యాంకింగ్, బీఎస్ఎన్ఎల్, విమానయానం, రైల్వే, బొగ్గు ఉత్పత్తి సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు పూనుకుందని మండిపడ్డారు. రైతులకు నష్టం చేసేలా పలు చట్టాలను తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయించకుండా వెనుకబడిన తరగతుల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేలా కుట్ర చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, పట్టణ కార్యదర్శి హనుమకొండ శ్రీధర్, నాయకులు బుర్రి ఆంజనేయులు, అక్కపెల్లి సుధాకర్, పెండ్యాల సారయ్య, మొగులోజు శారద, కందికొండ రాజు, జగన్నాథం, కార్తీక్, కలకోట అనిల్, వజ్జంతి విజయ, ఫరీదా, బిట్ర స్వప్న, లక్ష్మి, సింగారపు బాబు, నర్సింహరాములు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

నర్సంపేట : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అనంతగిరి రవి తెలిపారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఆల్ ట్రేడ్ యూనియన్స్ సమావేశంలో మల్లేశం, యువరాజు, రవి మాట్లాడారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం సవరించి నాలుగు కోడ్‌లుగా మార్చినట్టు తెలిపారు. సమావేశంలో హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి (బీఆర్‌టీయూ అనుబంధం) లక్ష్మినారాయణ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు హనుమకొండ శ్రీధర్, కంది కొండ రాజు, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు పైడయ్య, ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎల్లన్న, ఏఐటీయూసీ హమాలీ నాయకుడు నాగులు పాల్గొన్నారు.



నర్సంపేట : మాట్లాడుతున్న మల్లేశం

కరపత్రాల ఆవిష్కరణ

వర్ధన్నపేట : ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్, కార్మిక సమ్మె కరపత్రాలను పట్టణంలోని సివిల్ సప్లయీస్ గోదాం వద్ద ఎస్‌కేఎం నాయకులు రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెల్లి రవి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్, కార్మిక సమ్మె తలపెట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మైదంపాని ఆరోగ్యం, జలగం సునీల్, భుజంగం, భిక్షపతి, రామకృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు'



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట : హామీల అమలు కోరుతూ చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్లిన రైతులను ముళ్ల కంచెలతో అడ్డుకొని బీభత్సం సృష్టించిన కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ హెచ్చరించారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో కేశెట్టి సదానందం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో రమేశ్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించి విదేశీ పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా మూడు నల్ల చట్టాలను రూపొందించిందని విమర్శించారు. న్నారు. అదానీ, అంబానీలకు ఇచ్చిన రాయితీలు, సబ్సిడీలు పేద రైతులకు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసి రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేలా చట్టం చేయాలని ఏడాదికిపైగా రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రక ఉద్యమం చేపడితే దిగివచ్చిన ప్రభుత్వం హామీలు ఇచ్చి మూడేళ్లు గడచినా అమలు చేయడం లేదన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి వెళ్లిన రైతులపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును అన్ని వర్గాల ప్రజలు ఖండించాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకుడు నాగెల్లి కొమురయ్య, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, రైతు సంఘం నాయకులు శివకుమార్, రాజన్న, ప్రభు, యాదగిరి, సురేశ్, సదానందం, రమేశ్, కోటి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్ల అందజేత



విద్యార్థులతో సాంబయ్య, ఉపాధ్యాయులు

నల్లబెల్లి : మండలంలోని రంగాపురంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య మంగళవారం పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అశోక్, ఉపాధ్యాయులు దామోదర్, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, మహిపాల్, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

14న తాండ్ర కుమార్ వర్ధంతి

చెన్నారావుపేట : ఈనెల 14న హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్ ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, నాయకుడు కేశెట్టి సదానందం, మండల కార్యదర్శి జన్ను రమేశ్ తెలిపారు.మండల కేంద్రంలో వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి హాజరై మాట్లాడారు. తాండ్ర కుమార్ హైదరాబాద్‌లో గుడిసె పోరాటాలు చేస్తూ పేదల పక్షాన పోరాడినట్టు తెలిపారు. కుమార్ ఆశయ సాధనకు శ్రేణులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బిచ్యానాయక్, సాంబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో వార్షికోత్సవ పూజలు



ఖానాపురం : మండల కేంద్రంలో హనుమాన్ ఆలయంలో ఏడో వార్షికోత్సవ పూజలు మంగళవారం చేశారు. అభయ ఆంజనేయస్వామి ఆలయ కమిటీ, దాతల సహకారంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 11 రకాల పండ్లతో అభిషేకాలు, హోమం చేశారు. మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు ప్రత్యేక మొక్కులు చెల్లించారు.

'కోదండరెడ్డి వ్యాఖ్యలు మోసపూరితం'

నర్సంపేట : వరి ధాన్యానికి మద్దతు ధర మీద రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామని, మిగతా పంటలకు సైతం బోనస్ ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వగా ధరలు పడిపోయినప్పుడు మాత్రమే బోనస్ ఇస్తామంటూ ధరణి సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు కోదండరెడ్డి చేసిన వ్యాఖ్యలు మోసపూరితంగా ఉన్నాయని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ధరలు పడిపోతే ప్రభుత్వాలే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని చట్టంలో ఉందని, సీఎం కేసీఆర్ నాయకత్వంలోని గత ప్రభుత్వం అలాగే కొనుగోలు చేసిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల పేరుతో రైతులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. రైతు భరోసా రూ.15 వేలు వేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చి పాత పద్ధతిలో, అసంపూర్ణంగా రైతుబంధు వేస్తోందని గుర్తు చేశారు. మోసపూరిత కాంగ్రెస్ పార్టీకి రైతుల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులు నిలదీయాలని కోరారు.

కుమారుడికి తలకొరివి పెట్టిన తల్లి



సంగెం : తలకొరివి పెట్టాల్సిన కుమారుడికే కన్న తల్లి తలకొరివి పెట్టిన విషాద ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన దౌలత్‌బాజి మమత–సురేందర్ దంపతులకు కొడుకు అజయ్, కూతురు ఉన్నారు. 11 ఏళ్ల క్రితం సురేందర్ మృతి చెందగా అజయ్ హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని వెంకటాపురం గ్రామంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. అజయ్ డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ జల్సాలకు అలవడడంతో ఈనెల 2న తల్లి మమత మందలించింది. ఈ క్రమంలో అజయ్ మనస్థానానికి గురై అదే రోజు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. అజయ్ మృతదేహానికి రామచంద్రాపురం తీసుకురాగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో విషాదం నెలకొంది.

బాలుడి చికిత్సకు కాంగ్రెస్ నాయకుడి సాయం



గీసుకొండ : మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన బాలుడు నల్లవెల్లి జోసెఫ్ అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స కోసం అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.15 వేల సాయం అందజేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన రూ.15 వేలను ఆ పార్టీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు అల్లం మర్రెడ్డి, కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, మాదాసి రాంబాబు, మర్రి క్రాంతి, కూనమల్ల అనిల్, కందికొండ రాజు తదితరులు మంగళవారం జోసెఫ్ కుటుంబానికి అందజేశారు. అనంతరం తుమ్మనపెల్లి శ్రీనివాస్ మాట్లాడారు. జోసెఫ్ అనారోగ్యంతో బాధపడు తున్న విషయాన్ని తెలియజేయడంతో బాల కిశోర్‌రెడ్డి స్పందించి ఆర్థికసాయం అందజేయ డానికి ముందుకొచ్చారని చెప్పారు.

గంగుల రేఖకు డాక్టరేట్

మామునూరు: బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గంగుల రేఖకు విజయవాడ కేఎల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ యూనివర్సిటీలో డాక్టర్ మురళీమోహన్ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేసింది. కళాశాలలో ఆమెను మంగళవారం సన్మానించారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో పెద్దపట్నం



ఐనవోలు : మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేడుక నిర్వహించారు. మాస సంక్రమణ సందర్భంగా స్వామివారికి అర్చకుడు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, శ్రీగొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మ సమేత మల్లికార్జునస్వామి కల్యాణంతో పాటు ఒగ్గు పూజారులచే పెద్దపట్నం వేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్‌రావు, దేవాలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, పండితులు గట్టు పురుషోత్తంశర్మ, అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అవగాహనతోనే బాలల అభివృద్ధి

పర్వతగిరి : అవగాహన ఉంటేనే బాలలు అభివృద్ధి చెందుతారని ప్రముఖ జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి తెలిపారు. 'బేటీ పడావో–బేటీ బచావో' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుంటూరుపల్లి జెడ్పీ ఉన్నత, మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లింగ వివక్షత, సెక్స్ రేషియో, లింగ సమానత్వం, చైల్డ్ మ్యారేజ్, పోక్సో యాక్ట్, స్మార్ట్ ఫోన్ వల్ల ప్రయోజనం, అనర్థాల గురించి వివరించారు. బాలలు ఆపద సమయంలో చైల్డ్ రైట్స్ హెల్ప్ లైన్ నంబర్ 1098, 181, 100, 14567, 155326, 1930లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమాదేవి

బోరు బావి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కళావతి

సంగెం : మండల కేంద్రంలోని సంగమేశ్వరాలయంలో, ఆరోగ్య ఉపకేంద్రంలో, శాంతి మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో చేపట్టిన బోర్ బావి నిర్మాణ పనులను ఎంపీపీ కళావతి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండల పరిషత్ నుంచి మంజూరైన రూ.3 లక్షల వ్యయంతో మూడు చోట్ల బోరుబావుల నిర్మాణాన్ని చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, సొసైటీ డైరెక్టర్ పులి వీరస్వామిగౌడ్, నాయకులు మెట్టుపల్లి రమేశ్, ఆగపాటి రాజు, కోడూరి సదయ్య, నాగార్జున శర్మ, కోటేశ్వర్, మల్లికార్జున్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కల్యాణి, ఏపీఎం కిషన్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, సీసీలు కుమారస్వామి, ఏలియా, రాజయ్య, కృష్ణమూర్తి, సురేశ్, కృష్ణ, సుజాత, వీఓఏలు రామ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి గ్రామంలో మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కల్వల శాంత, ఉపాధ్యక్షులుగా నల్ల రజిత, లక్క కవిత, ప్రధాన కార్యదర్శిగా గిన్నె లలిత, కోశాధికారిగా కొనకటి శ్రీదేవి, కార్యదర్శిగా బోనగిరి నాగలక్ష్మి, ప్రచార కార్యదర్శిగా కొత్తపల్లి భారతి, సభ్యులుగా బుస్సాని భవానీ, సాంబారి నాగలక్ష్మి, చల్ల శైలజ, కొలువుల మాధవి, ఎలగొండ పూజిత, కోరె కొమురమ్మ, లక్ష్మి, కంత్రి ఈశ్వర, గిన్నె అరుణ, తుమ్మలపెల్లి రవీన ఎన్నికయ్యారు. ఈ మేరకు కార్యవర్గానికి ఎన్నిక పత్రాన్ని ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెండి సక్కుబాయి, జిల్లా నాయకురాలు కోతి మమత అందజేశారు. అభినందనలు తెలిపారు.



ఎన్నిక పత్రం అందజేస్తున్న సక్కుబాయి

మద్దిమేడారంలో హుండీల ఏర్పాటు



హుండీల వద్ద అధికారులు, తదితరులు

నల్లబెల్లి : మండలంలోని నాగరాజుపల్లి మద్దిమేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు హుండీలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ శాఖ మహబూబాబాద్ ఇన్‌స్పెక్టర్ కవిత పర్యవేక్షణలో ఈఓ భిక్షమాచారి హుండీలకు సీల్ వేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేంద్రప్రసాద్, ఆలయ కమిటీ డైరెక్టర్లు భూంపెల్లి శ్రీనివాస్, మెడిద కిరణ్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు మురహరి కిరణ్, ఆలయ పూజారులు దురిశెట్టి సమ్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థిని ప్రతిభ

వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న డి.హిమబిందు సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చాటిన జిల్లాస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిందని హెచ్‌ఎం రాపాక సదానందం తెలిపారు. పట్టణంలో ఆ స్కూల్‌లో విద్యార్థిని హిమబిందును, ఆమెకు గైడ్ టీచర్‌గా వ్యవహరించిన ధనలక్ష్మిని హెచ్‌ఎం సదానందం, ఎస్ఎంసీ చైర్మన్ నీటి ఎల్లయ్య మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. హిమబిందు సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించిన 'ఎర్ కూలర్ కమ్ వాటర్ కూలర్ ఎట్ ఫంక్షన్' ఎగ్జిబిట్‌కు జిల్లా స్థాయిలో తృతీయ స్థానం లభించిందని చెప్పారు. గైడ్ టీచర్ ధనలక్ష్మి మాట్లాడుతూ హిమబిందు ప్రదర్శించిన ప్రయోగం వాతావరణంలోని క్లోరోఫ్లోరో కార్బన్ (సీఎఫ్‌సీ) తగ్గించి వాతావరణాన్ని కాపాడుతుందని తెలిపారు.



డీఈఓ వాసంతి నుంచి బహుమతి అందుకుంటున్న హిమబిందు

క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నతి



విద్యార్థులతో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నతి సాధించగలరని సిద్ధార్థ హైస్కూల్ హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆ స్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. డీఈఓగా గుగులోతు చిత్రజ, ఎంఈఓగా బానోతు సుమన్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌గా గౌడుగు స్నేహిత, ప్రిన్సిపాల్‌గా కుండె అఖిల్, వైస్ ప్రిన్సిపాల్‌గా జాటోతు అంజలి వ్యవహరించి ఆకట్టుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. తద్వారానే జీవితంలో రాణించగలరని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జక్కుల జగదీశ్వర్, మేడి రమేశ్, బొనగాల రమేశ్, కృష్ణమోహన్, వేణు, గణేశ్, రాజు, రమేశ్, ఆరె రాజు, వీరాచారి, కందిక నవీన్, బాలరాజు, వెంకటేశ్వర్లు, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.